# బతుకమ్మకుంట చెరువే కాదు..!

- నాగమయ్యకుంట నుంచి నీళ్లు వచ్చేవి
- అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి



కోర్టు స్టేటస్‌కో ఇచ్చినా బతుకమ్మ కుంట వద్ద చేపడుతున్న పనులు

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): బాగ్‌అంబర్‌పేటలోని బతుకమ్మకుంట అసలు చెరువే కాదని, వాటర్‌బాడీ కానిచోట చెరువు ఉన్నదంటూ సృష్టించేందుకు కాంగ్రెస్‌నేతలు, హైడ్రాతో కలిసి ప్రయత్నిస్తున్నారని అంబర్ పేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. బతుకమ్మకుంట పూర్తిగా ఖుష్కిగా పేర్కొన్నారని, డ్రై ల్యాండ్‌లో 1987వరకు వ్యవసాయం చేశారని, నాగమయ్యకుంట నుంచి కిందకు నీళ్లు వచ్చేవని, వాటిని సాగుకు అనుకూలంగా వాడుకునేవారమని తెలిపారు. బతుకమ్మకుంట విషయంలో తన దగ్గర పూర్తి ఆధారాలున్నాయన్నారు. మంగళవారం సుధాకర్‌రెడ్డి తన దగ్గరున్న ఆధారాలు చూపుతూ మాట్లాడారు. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ రికార్డుల్లో ఎక్కడా బతుకమ్మకుంట చెరువు అని నమోదు కాలేదని, గ్రామ, టౌన్ సర్వేల ప్రకారం సర్వేనంబర్ 563/1, 2లో 9.9 ఎకరాల భూమి డ్రై ల్యాండ్ అని, ఇందులో 1.34 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఒకవేళ బతుకమ్మ కుంట వాటర్ బాడీ అయితే మే 25,1978లో ఏపీ గెజిట్ నోటిఫికేషన్‌లో బాగ్‌అంబర్‌పేట గ్రామంలోని సర్వే నెంబర్లు 563/1, 2 సయ్యద్ అజామ్ తదితరులకు చెందిన భూమిని డ్రైల్యాండ్‌అని ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గతంలో అక్కడ ఖాళీస్థలంగా కూడా పలుశాఖల రికార్డుల్లో చూపించారని, చెరువు ఉంటే అక్కడ ఖాళీస్థలంగా ఎలా చూపిస్తారని ప్రశ్నించారు. విలేజ్‌మ్యాప్‌లో అంబర్‌పేటలో ఎక్కడా కుంటలు లేవని స్పష్టంగా పేర్కొన్నారని, టౌన్ సర్వేలో కూడా డ్రై ల్యాండ్ అని ఎలా ఉందని ప్రశ్నించారు. 1999లో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంబర్‌పేటలోని కొన్ని సర్వేనంబర్లలో మొత్తం 25 ఎకరాల్లో 18 ఎకరాలు మినహా మిగతా 7 ఎకరాల భూమిని మూడునెలల్లోగా క్లియర్ చేయాలని చెప్పారు. ఈ తీర్పులో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి అడిగినట్లుగా పేర్కొని ఆ స్థలంలో వాటర్‌ట్యాంక్ కన్వర్షన్‌కు ఒప్పుకోలేదని, అటువంటప్పుడు ఇప్పుడు ఎలా ట్యాంక్ చేస్తారని అడిగారు. బతుకమ్మకుంట ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చారని, వీటిపై అభ్యంతరాలు తీసుకోకుండానే బతుకమ్మకుంటలో చెరువు పనులు ఎలా మొదలుపెడతారని అడిగారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న రెండు మ్యాపుల ప్రకారం ఎఫ్‌టీఎల్, వాటర్‌స్ప్రెడ్ ఏరియాలను ఖాళీలుగా పెట్టి వాటర్‌లెవల్ బేసిక్ పాయింట్ లేకుండా చూపించిందంటూ, అసలు అక్కడ వాటర్‌బాడీయే లేనప్పుడు, హద్దులు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. పురాతనం నుంచి ఇక్కడ చెరువు ఉన్నదని, ఇక్కడ ఈతలు కొట్టామని కొందరు కాంగ్రెస్ నేతలు చెప్పారని, అసలు పురాతనమైన రికార్డు 1352 ఫసలీ సేత్వార్‌లో ఖుష్కీల్యాండ్ అనే పదం వారికి కనిపించడంలేదా అని అడిగారు. 1987 వరకు ఈ భూమిలో సాగు చేసినట్లుగా ఆధారాలున్నాయని, అప్పటివరకు భూమిశిస్తు కూడా కట్టామని చెప్పారు. రెవెన్యూ రికార్డులు, లింక్ డాక్యుమెంట్ల ప్రకారం ప్రైవేటు పట్టాదారుగానే నమోదైందని, ఎమ్మార్వో కూడా ప్రైవేటు పట్టాదారుకు సంబంధించిన డ్రై ల్యాండ్‌గానే లెటర్ ఇచ్చారని తెలిపారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఒక కమిటీ వేసి నిజానిజాలు తేల్చాలని సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### హైడ్రా కమిషనర్‌కు సమాచారమిచ్చిన..

బతుకమ్మ కుంట విషయంలో ఈనెల 7న హైకోర్టు స్టేటస్‌కో ఇచ్చినా హైడ్రా ఆధ్వర్యంలో కుంట వద్ద పనులు చేస్తూనే ఉన్నదని, రాత్రింబవళ్లు ఈ పనులు జరుగుతున్నాయని ఈ విషయాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వాట్సాప్ ద్వారా సమాచారమిచ్చిన స్పందించలేదని సుధాకర్‌రెడ్డి చెప్పారు. హైకోర్టు బతుకమ్మకుంట విషయంలో ఇరు పక్షాలు జూన్ 10వరకు ఎలాంటి పనులు చేయవద్దంటూ స్టేటస్ కో ఇచ్చినా తెల్లవారే ఈనెల 8న హైడ్రా పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవ వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంటను గుంజుకుంటామన్నారన్నారు. హైడ్రా దగ్గర ఎలాంటి ఆధారాలు లేకుండానే బతుకమ్మ కుంటను వాటర్ బాడీగా చూపించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పలురకాల డ్రామాలు ఆడుతున్నారని, ఇప్పటివరకు మూడు కోర్టుల్లోనూ కేవియట్ వేశారని, అంతగా భయం లేకపోతే తమ దగ్గర ఉన్న ఆధారాలతో పోరాటం చేయవచ్చు కదా అని అడిగారు. స్టేటస్‌కో ఇచ్చిన తర్వాత కూడా హైడ్రా పనులు చేస్తున్నదని ఈ విషయంలో సెక్షన్ 12 కంటెంప్ట్ ఆఫ్ కోర్ట్స్ యాక్ట్ కింద ఈనెల 10వ తేదీన హైడ్రా కమిషనర్‌కు నోటీసులు జారీ చేశామని ఆయన తెలిపారు.

### కాంగ్రెస్‌లోకి రమ్మని ఒత్తిడి చేస్తున్నారు..

బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి రావాలంటూ తనపై ఒత్తిడి తెస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తనతో మాట్లాడారని, రోహిన్‌రెడ్డి సీఎంతో మాట్లాడించారని, తాను రాను అన్నందుకు బతుకమ్మకుంటను వివాదాస్పదం చేసి రేవంత్‌రెడ్డి తనను టార్గెట్ చేస్తున్నారని ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. రేవంత్‌రెడ్డి సోదరుడు కూడా తనను పార్టీలోకి రమ్మని ఒత్తిడి చేశారని చెప్పారు. తనలాంటి ఉద్యమకారులను బెదిరించినా తాము పార్టీ మారేది లేదని, కేసీఆర్‌ను,గులాబీ జెండాను వదిలేది లేదని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంతకూ రేవంత్‌రెడ్డికి హన్మంతన్న మీద ప్రేమనా లేక సుధాకర్‌రెడ్డి పార్టీ మారాలన్న లక్ష్యమా చెప్పాలని సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బతుకమ్మకుంటలో బతుకమ్మలు ఆడించాలని కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారని, వి హన్మంతరావు ఇంటిపక్కనే ఉన్న మొయిన్ చెరువులో బతుకమ్మలు ఆడించాలని, చెరువే కాని బతుకమ్మకుంటలో చెరువు ఎలా చేస్తారని అడిగారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మొయిన్ చెరువును రూ. 16కోట్లతో అభివృద్ధి చేశారని, ఇప్పుడంతా అడవిలా మారిపోవడంతో స్థానికులు మొత్తుకుంటున్నారన్నారు. హైడ్రా చెరువుల అభివృద్ధి అంటున్నదని, ఆ లిస్ట్‌లో 60ఎకరాల మొయిన్ చెరువు ఎందుకు లేదని, అక్కడ అభివృద్ధి చేసి బతుకమ్మలు ఆడించవచ్చు కదా అని ప్రశ్నించారు.



కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

# దమ్ముంటే స్థానిక ఎన్నికలు పెట్టండి

## ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు

**ప్రజాక్షేత్రంలోకి పోవడానికి భయమెందుకు?**

**కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్యే సబితారెడ్డి సవాల్**

బడంగ్‌పేట్, మే 13: కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సవాల్ విసిరారు. నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏడాదిన్నరగా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించడంతో పాటు సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు. హామీలపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో కాంగ్రెస్ పార్టీ లీడర్లు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారన్నారు. ధైర్యం లేకనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేస్తూ వస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు పెట్టినా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సబితారెడ్డి స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్ అంటేనే భరోసా..

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా పేద ప్రజలకు ఆర్థిక భరోసా అందించామన్నారు. మహిళల జీవితాల్లో వెలుగు నింపే ప్రయత్నం చేశామన్నారు. ఇప్పటికీ ప్రజల సంక్షేమమే మా ప్రథమ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కల్యాణ లక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటివరకు దానిని అమలు చేయలేదన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ తులం బంగారం ప్రభుత్వం బాకీ ఉందన్నారు. తులం బంగారం ఇచ్చేంతవరకు మహిళల పక్షాన నిలదీస్తూనే ఉంటామన్నారు. ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్‌లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని సబితారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమన్నారు. బాలాపూర్ మండల తహసీల్దార్ ఇందిరా దేవి, జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌రామ్, మాజీ చైర్మన్ అబ్దుల్, సాది, మాజీ కౌన్సిలర్లు మాజీ కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో ఖాళీ చేయండి

**మిథిలానగర్ వ్యవహారంపై రెవెన్యూ శాఖ సీరియస్**

బంజారాహిల్స్,మే 13: వేరే ప్రాంతానికి చెందిన ఇంటిస్థలం పత్రాలను చూపించి ప్రభుత్వ స్థలంలో జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తెచ్చుకున్న నిర్మాణదారులకు రెవెన్యూశాఖ అధికారులు షాక్ ఇచ్చారు.

వివరాల్లోకి వెళ్తే.. షేక్‌పేట మండల పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని మిథిలానగర్ కాలనీలో గున్నా జైదీప్‌రెడ్డి, గున్నా సందీప్‌రెడ్డిలకు చెందిన 1200 గజాల స్థలంలో భవన నిర్మాణం కోసం శివరాజ్ ఠాకూర్ అనే బిల్డర్ భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నాడు. కాగా ఈ స్థలం పక్కనే ఉదయ్‌నగర్ నాలా ఉండడంతో నీటి పారుదలశాఖ నుంచి ఎన్‌వోసీ కూడా తీసుకున్నారు. కాగా ఈ స్థలం చుట్టూ నాలాను ఆనుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తుండడంతో స్థానికులు ఫిర్యాదులు చేయడంతో నమస్తే తెలంగాణ పత్రిక వరుస కథనాలు ప్రచురించింది. ఈ వ్యవహారంలో లోతుగా పరిశీలన చేపట్టగా సర్వే నంబర్ 403లోని ప్రభుత్వ స్థలంలో జీహెచ్ఎంసీ అనుమతి ఇచ్చిన సమయంలో రెవెన్యూ క్లియరెన్స్ లేకుండా, జాయింట్ ఇన్స్‌పెక్షన్ చేయకుండానే నీటిపారుదల శాఖ అధికారులు నాలా బఫర్ జోన్ కేవలం 3.70 మీటర్లే అంటూ ఎన్‌వోసీ జారీ చేసినట్లు బయటపడింది. ఈ వ్యవహారంపై నమస్తే తెలంగాణ కథనాలతో రంగంలోకి దిగిన షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు స్థలాన్ని పరిశీలించగా శివరాజ్ ఠాకూర్ అనే బిల్డర్ అనుమతి తీసుకున్న స్థలంలో 950 గజాల స్థలం సర్వే నెంబర్ 403లోని టీఎస్–నెంబర్ 2,వార్డు –11, బ్లాక్–ఎస్‌లోకి వస్తుందని, టీఎస్ఎల్ఆర్ ప్రకారం ఈ స్థలం మొత్తం ప్రభుత్వానిదే అని తేలడంతో అక్కడి ఆక్రమణలను తొలగించి,, ఖాళీ చేయాలని సెక్షన్ 7 ఆఫ్ ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్ కింద మంగళవారం నోటీసులు జారీ చేశారు. స్థలం యజమానులు నోటీసులు స్వీకరించకపోవడంతో ఇంటికి అంటించారు. వారం రోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే తామే వాటిని తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి తెలిపారు.



ఉదయ్‌నగర్ నాలావైపున ప్రభుత్వ స్థలం చుట్టూ షీట్లు పెట్టి ప్రైవేట్ స్థలం అంటూ రాసిన దృశ్యం

# ఆలిండియా నం.1గా శ్రీచైతన్య

**సీబీఎస్ఈ ఫలితాలలో..**

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): సీబీఎస్ఈ పదోతరగతి ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ 498 మార్కులతో మరోసారి ఆలిండియా నెం.1గా నిలిచి రికార్డు సృష్టించిందని ఆ స్కూల్ డైరెక్టర్ సీమ వెల్లడించారు. ఆరుగురు విద్యార్థులు 497 మార్కులు ఆపైన, 197 మంది విద్యార్థులు 490 మార్కులు ఆపైన, 480 మార్కులు ఆపైన 917 మంది విద్యార్థులు సాధించగా, అత్యధిక బ్రాంచీలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు. శ్రీచైతన్య స్కూల్ కల్గిన మెజారిటీ రాష్ట్రాలలో స్టేట్ టాప్ మార్కులతో పాటు అత్యధిక యావరేజ్, పాస్ పర్సంటేజ్‌తో ఆలిండియాలోనే కాదు, ఆయా రాష్ట్రాలలో కూడా చైతన్య స్కూల్ నెం.1గా నిలిచిందని సీమా చెప్పారు. టాప్ మార్కులలోను, ఉత్తీర్ణత శాతం, సగటు మార్కులలో ఏ ఇతర విద్యా సంస్థలు చైతన్య సాధించిన ఫలితాలను సాధించలేకపోయాయని అన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో ఫస్ట్ ర్యాంకుతో పాటు 100 లోపు ర్యాంకులు 19 మంది శ్రీచైతన్య సాధించిందని ఆమె తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీఓ–ఐపీయల్, సి–ఐపీయల్, యమ్‌పీయల్, సి–బ్యాచ్, యస్–బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకాడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్‌తో పాటు అంకిత భావంతో పనిచేసే అధ్యాపకుల వల్ల మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని డైరెక్టర్ సీమ తెలిపారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

# గ్రేడింగ్ విధానాన్నే అమలుచేయండి

**మంత్రి శ్రీధర్‌బాబుకు ట్రాస్మా ప్రతినిధుల వినతి**



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ట్రాస్మా ప్రతినిధులు

హిమాయత్ నగర్, మే 13: వచ్చే విద్యా సంవత్సరం నుంచి 2025 గ్రేడింగ్ విధానమే అమలు చేయాలని తెలంగాణ రికగ్నైసేడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే అనిల్ కుమార్, కోశాధికారి కే శ్రీకాంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వారు మంగళవారం రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులతో బడ్జెట్ స్కూల్ ఉపాధ్యాయులకు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో సర్వీస్ రూల్స్ ప్రకారం సన్మానించి అవార్డులు ఇవ్వాలన్నారు. అదే విధంగా కార్పొరేట్ స్కూల్‌లను నియంత్రించాలన్నారు. బడ్జెట్ పాఠశాలలో 10 నుంచి 15 శాతం ఫీజులు పెంచుకునే అవకాశం కల్పించాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. అనంతరం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగిత రాణా, శ్రీ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిను కలిసిన ట్రస్మా సభ్యులు వారికి వినతిపత్రాలు అందజేశారు.

### తలసీమియాపై అవగాహన

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): తలసీమియా, రక్తహీనత నిర్ధారణ, నివారణల తాజా పరిస్థితులపై మంగళవారం హైదరాబాద్‌కుచెందిన తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ(టీఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 'తలసీమియా, రక్తహీనత – నిర్ధారణ, నిర్వహణ' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీసర డివిజన్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డా. బనోత్ సత్యవతి మాట్లాడుతూ..రక్త సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. టీఎస్‌సీఎస్ కార్యదర్శి డా. సుమన్ జైన్, ఉపాధ్యక్షురాలు రత్నవల్లి కోటపల్లి, మెడికల్ ఆఫీసర్ డా. కే సరోజ తదితరులు పాల్గొన్నారు.

# ఎందుకు కూల్చవద్దో సమాధానం ఇవ్వండి

**అనుమతి లేని భవనాలకు జీహెచ్ఎంసీ షోకాజ్ నోటీసులు**

**విచారణకు హాజరు కావాలని యజమానులకు ఆదేశం**

బంజారాహిల్స్, మే 13: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన భారీ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు విచారణ చేపట్టారు. పదిరోజుల క్రితం నమస్తే తెలంగాణ పత్రికలో 'నిబంధనలకు ఉరి– నోటీసులతో సరి' పేరుతో వచ్చిన కథనాలపై ఎట్టకేలకు స్పందించిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని కమలాపురి కాలనీ ఫేజ్–3 కిందకు వచ్చే ఇందిరానగర్ బస్తీ ప్రధాన రహదారిపై నర్సింగ్ యాదవ్ అనే వ్యాపారి భారీ వాణిజ్య నిర్మాణం చేపట్టారు. సుమారు 600 గజాల స్థలంలో జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సెల్లార్‌తో పాటు 6 అంతస్థుల భవనం నిర్మిస్తున్న వ్యవహారంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. బస్తీకి వెళ్లే ప్రధాన రహదారిపై కమర్షియల్ బిల్డింగ్‌కు కనీస సెట్‌బ్యాక్‌లు ఇవ్వడం లేదని, భవనానికి రెండు వైపులా ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే భారీ నష్టం తప్పదని గుర్తించారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారంతోనే భారీ భవనం నిర్మించారని స్థానికులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో స్పందించిన జీహెచ్ఎంసీ సర్కిల్–18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సదరు నిర్మాణదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలను ఎందుకు కూల్చివేయరాదో వారం రోజుల్లోగా జవాబు ఇవ్వాలని షోకాజ్ నోటీసులో కోరారు. ఈ విషయమై విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు డీఎంసీ సమ్మయ్య తెలిపారు. ఈ భవనంతో పాటు జవహర్‌నగర్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం 2కు వెళ్లే లింక్ రోడ్డుపై 300 గజాల స్థలంలో రవీందర్ యాదవ్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా 5 ఫ్లోర్ల కమర్షియల్ బిల్డింగ్ వ్యవహారంలో సైతం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.



ఇందిరానగర్‌లో రోడ్డును ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం

### సరస్వతీ పుష్కరాలకు.. ప్రత్యేక బస్సులు

సిటీబ్యూరో, మే 13 ( నమస్తే తెలంగాణ ) : సరస్వతీ నదీ పుష్కరాలకు గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 12 ఏండ్లకు ఒకసారి జరిగే సరస్వతీ నదీ పుష్కరాలకు ఈనెల 14 నుంచి 25 వరకు కాళేశ్వరంకు ప్రత్యేక బస్సులు నడపనుందని తెలిపారు. జేబీఎస్, ఎంజీబీఎస్, కూకట్‌పల్లి, ఉప్పల్, జీడిమెట్ల, మేడ్చల్ నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒకే కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే ఆ కాలనీకి బస్సు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9676671533, 99592 26154 సంప్రదించాలన్నారు.



రాజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభాకర్ రెడ్డి తదితరులు

# మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డికి నివాళి

ఉప్పల్, మే 13: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే దివంగత బండారి రాజిరెడ్డి చిత్రపటానికి మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం రాజిరెడ్డి తనయుడు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బండారి నీలం రెడ్డి, వెంకట్ రెడ్డి, జగన్, బీఆర్ఎస్ నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జోయాలుక్కాస్‌లో ఎక్స్ఛేంజ్ మేళా

సిటీబ్యూరో, మే13 (నమస్తే తెలంగాణ): ప్రముఖ నగల దుకాణమైన జోయాలుక్కాస్ కస్టమర్ల కోసం సరికొత్త ఆఫర్‌తో ముందుకొచ్చింది. మే 9 నుంచి 25 వరకు 'ద బిగ్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా'ను నిర్వహిస్తోంది. ఈ మేళాలో భాగంగా కస్టమర్లు తమ పాత బంగారాన్ని ఎక్స్ఛేంజ్ చేసే సమయంలో ప్రతి గ్రాముపై రూ.100 అదనంగా పొందవచ్చు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ జాయ్ అలూక్కాస్ మాట్లాడుతూ.. కస్టమర్ల కోసం ఆఫర్లను తీసుకొచ్చేందుకు ఎల్లవేళలా ముందుంటామని అన్నారు. కస్టమర్లు తమ పాత బంగారాన్ని తీసుకొచ్చి.. కొత్త సొగసైన, మరింత విలువైన బంగారాన్ని తీసుకెళ్లేందుకు సరైన సమయమని తెలిపారు.

# డిజిటల్ మ్యాపింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయండి

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): ప్రజారోగ్య సేవలను విస్తరించేందుకు డిజిటల్ మ్యాపింగ్ ఉపయోగంపై మంగళవారం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మెడికల్ సర్వీసుల 100 శాతం కవర్‌ను సాధించేందుకు తక్కువ, మధ్య, దీర్ఘకాల ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో పలు శాఖల కీలక ప్రతినిధులు పాల్గొని మెడికల్ సర్వీసుల పునరుద్ధరణ, విస్తరణకు డిజిటల్ టూల్స్ ఉపయోగంపై చర్చించారు.

### 15లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలి

రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తులను ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పరిశీలించి సంబంధిత బ్యాంకులకు త్వరితగతిన పంపించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబంధిత మండల కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్ అధికారులు, ఎల్డీయం, జీహెచ్ఎంసీ అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని పత్రాలను నేటికీ సమర్పించని లబ్ధిదారులు తమ వార్డు ఆఫీసులో సత్వరమే సమర్పించాలని సూచించారు.1,28,763 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 1,11,536 దరఖాస్తులను మండల స్థాయిలో పరిశీలించారని తెలిపారు. ఇప్పటివరకు 40,994 దరఖాస్తుల వివరాలను సంబంధిత బ్యాంకులకు పంపించారని అన్నారు.

### సీబీఎస్ఈ పది ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విజయభేరి

సిటీబ్యూరో, మే 13 (నమస్తే తెలంగాణ): సీబీఎస్ఈ–2025 పదోతరగతి ఫలితాలలో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు సంచలన ఫలితాలు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. మంగళవారం విడుదలైన ఎ.ఐ.ఎస్.ఎస్.ఇ(సీబీఎస్ఈ) ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. భాష్యం బ్లూమ్స్ విద్యార్థి ఎస్‌కేఎం శ్రీహర్ష 500 మార్కులకుగాను 492 మార్కులు సాధించి భాష్యంకు గర్వకారణంగా నిలిచారన్నారు. ఎ.సాయినిఖిత 490, టీ అనీష్ 489, బీ లిఖిత్ మనోఘ్న 488, పి.శ్రీసాయి మిత్ర 488, ఎ.శ్రీహరిణి 488, యశ్వంత్ సాయిత్ 486, కె.స్నిగ్ధ 485, మణియశ్వంత్ 485, పీయూష్ ఫోడికర్ 485, ఇ.రిషిక 485, డి.శ్రీహరిణి 485 వంటి అత్యుత్తమ మార్కులతో విశేష ప్రతిభ కనబరిచారన్నారు. 480 ఆపైగా 23 మంది, 470 ఆపైగా 63 మంది, 450 ఆపైగా 146 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.



# హైసియా స్పోర్ట్స్ టోర్నీ చాంప్ ఇన్ఫోసిస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా) నిర్వహించిన ఇంటర్ కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నీలో ఇన్ఫోసిస్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. టీసీఎస్ రన్నరప్‌గా నిలువగా, సింక్రోనీ మూడో స్థానం దక్కించుకుంది. మంగళవారం గచ్చిబౌలి ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ గచ్చిబౌలి వీపీ, డీసీ హెడ్ రఘు, హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

### మల్లేశ్‌కు రజతం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: డెహ్రాడూన్(ఉత్తరాఖండ్) వేదికగా జరిగిన ఏషియన్ యూనివర్సిటీ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన మల్లేశ్ రజత పతకంతో ఆకట్టుకున్నాడు. మంగళవారం జరిగిన పోటీలో మల్లేశ్‌కు స్క్వాట్‌లో స్వర్ణం, బెంచ్‌ప్రెస్‌లో కాంస్యం, డెడ్‌లిఫ్ట్‌లో రజతం దక్కాయి. ప్రత్యర్థులకు దీటైన పోటీనిచ్చిన మల్లేశ్ ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలిచి ఆకట్టుకున్నాడు.

# మల్టీలెవల్ పార్కింగ్ @ చార్మినార్

(మొదటిపేజీ తరువాయి)

పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని జీహెచ్ఎంసీ ఇటీవల నిర్ణయించింది.

### పీపీపీ పద్ధతిలో పనులు..

ఇందుకుగానూ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా ఆహ్వానించింది. ఈ మేరకు ఆసక్తి గల ఏజెన్సీలు ముందుకు వచ్చి ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. చార్మినార్ పరిసర ప్రాంతంలో అత్యాధునిక టెక్నాలజీతో మూడు అంతస్తుల్లో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. జీహెచ్ఎంసీ కేవలం స్థలం మాత్రమే ఇవ్వనుండగా, పనులు దక్కించుకున్న ఏజెన్సీ నిర్మాణంతో పాటు 15 ఏండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చూడనుంది. అయితే వచ్చిన ఆదాయంలో కొంతమేర ఆదాయాన్ని సదరు ఏజెన్సీ ప్రతి ఏటా జీహెచ్ఎంసీకి అందించాల్సి ఉంటుంది. ఈ మల్టీ లెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను సుమారు 3,493 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 3 బేస్‌మెంట్ స్థాయిల్లో, మూడు అంతస్తుల్లో నిర్మించనున్నారు. ఈ కాంప్లెక్స్ లో దాదాపు 150 ఫోర్ వీలర్ వెహికిల్స్, టూ వీలర్ పెయిడ్ పార్కింగ్ ఏర్పాట్లు ఉండనున్నాయి. అదనంగా బేస్ మెంట్, గ్రౌండ్ ఫ్లోర్లలో హ్యాకర్ల కోసం కమర్షియల్ ప్లేస్‌లను కూడా కేటాయించనున్నారు. అయితే గత ఏడేళ్లుగా ఈ మల్టీలెవల్ పార్కింగ్ బిల్డింగ్ నిర్మాణ పనులు పెండింగ్ పడుతూనే వస్తాయి. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కార్.. ఈ ప్రాజెక్ట్ పూర్తిచేయడంలో సఫలం అవుతుందో లేదో వేచిచూడాలి.